# "ఖేలో ఇండియా"తో

## క్రీడలకు కొత్త ఊపిరి..కొత్త తరం కలలకు రెక్కలు

- చాలా కాలం క్రితమే రావాల్సిన పథకం ఖేలో ఇండియా
- 'నేనూ ప్రభుత్వ అండతోనే ఎదిగాను'.. జ్వాలా గుత్తా
- రూ.29,054 కోట్లతో కొత్త దశ..గత కేటాయింపుల కంటే 8 రెట్లు అధిక నిధులు
- 10వేల మంది ఖేలో ఇండియా అథ్లెట్లు..మరో 20 వేల మంది క్రీడాకారులకు ప్రోత్సాహం
- గ్రామీణ ప్రతిభ నుంచి ఒలింపిక్ స్థాయి వరకు.. సమగ్ర శిక్షణకు ప్రాధాన్యం
- క్రీడల్లో పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా కొత్త విధానం
- తెలంగాణలో 33 ఖేలో ఇండియా కేంద్రాలు.. 601 మందికి పైగా క్రీడాకారులకు శిక్షణ
- మహిళా క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహం.. 127 అస్మిత లీగ్‌లలో 20,921 మంది పాల్గొనడం
- కేంద్ర-రాష్ట్రాల భాగస్వామ్యంతో క్రీడలకు మరింత బలం
- క్రీడలను చదువుతో అనుసంధానం చేస్తే మరిన్ని అద్భుత ఫలితాలు: సోనిబాలా దేవి










**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** ఖేలో ఇండియా పథకం భారత క్రీడారంగంలో పెనుమార్పులకు నాంది పలుకుతుందని రెండుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పతక విజేత జ్వాలా గుత్తా అన్నారు. ఈ పథకం చాలా కాలం క్రితమే రావాల్సిందని, క్రీడాకారులను క్షేత్రస్థాయి నుంచి ఉన్నత స్థాయికి తీర్చిదిద్దేందుకు ఇది గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జ్వాలా గుత్తా మాట్లాడారు. తన క్రీడా ప్రస్థానంలో ప్రభుత్వ మద్దతు ఎంతో కీలకంగా నిలిచిందని చెప్పారు. ప్రభుత్వం అందించే సహకారం లేకుండా తాను సాధించిన విజయాలు సాధ్యమయ్యేవి కావని పేర్కొన్నారు. కొత్త రూపంలో రూపొందించిన ఖేలో ఇండియా పథకం ఎంతో ఆశాజనకంగా ఉ ందన్నారు. క్షేత్రస్థాయి నుంచి క్రీడల అభివృద్ధి, సుస్థిరతపై దృష్టి సారించడం వల్ల పిల్లలను క్రీడల్లోకి పంపేందుకు తల్లిదండ్రుల్లో మరింత భరోసా కలుగుతుందని తెలిపారు.

## రూ.29,054 కోట్ల భారీ కేటాయింపు

2026-31 కాలానికి అమలు చేయనున్న పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకానికి గతంలో కంటే ఎనిమిది రెట్లు అధికంగా రూ.29,054 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ పథకం ద్వారా మద్దతు పొందే క్రీడాకారుల సంఖ్యను పది రెట్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. పథకంలో భాగంగా 30 క్రీడాంశాల్లో 10 వేల మంది ఖేలో ఇండియా అథ్లెట్లతో పాటు 20 వేల మంది వర్ధమాన ఖేలో ఇండియా అథ్లెట్లకు ప్రోత్సాహం అందించనున్నారు. క్రీడాకారులను అట్టడుగు స్థాయి నుంచి ఒలింపిక్ స్థాయికి తీసుకెళ్లేలా సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు ఎస్ఏఐ డిప్యూటీ డైరెక్టర్ ఎస్. హిమబిందు తెలిపారు. కోచ్‌లతో బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా చిన్నారుల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి మెరుగుపరచడంతో పాటు అకాడమీల వ్యవస్థను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలు, క్రీడా సాంకేతికత అభివృద్ధికి కూడా తగిన నిధులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

## తెలంగాణకు ప్రత్యేక ప్రయోజనం

తెలంగాణలో క్రీడాభివృద్ధికి కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 33 ఖేలో ఇండియా కేంద్రాలను మంజూరు చేయగా, మాజీ ఛాంపియన్ క్రీడాకారుల ద్వారా 601 మందికి పైగా శిక్షణ అందుతోంది. మేడ్చల్-మల్కాజ్‌గిరిలో ఖేలో ఇండియా స్టేట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తోంది. రోయింగ్, వెయిట్‌లిఫ్టింగ్, ఫెన్సింగ్ తదితర క్రీడాంశాల్లో 254 మంది క్రీడాకారులకు శిక్షణ, ప్రోత్సాహం అందుతోంది. వీరిలో 152 మంది పురుషులు, 102 మంది మహిళలు ఉన్నారు.

అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, సైక్లింగ్, టెన్నిస్, ఫుట్‌బాల్ తదితర క్రీడాంశాల్లో 19 ఖేలో ఇండియా గుర్తింపు పొందిన అకాడమీలను ఏర్పాటు చేసేందుకు నోటిఫై చేశారు. మహిళల కోసం నిర్వహించిన 127 అస్మిత లీగ్‌లలో 20,921 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు.

## కేంద్ర-రాష్ట్రాల భాగస్వామ్యానికి ప్రాధాన్యం

కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ, రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకం ప్రధాన లక్ష్యాల్లో ఒకటని అధికారులు తెలిపారు. ఈ ఏడాది చివర్లో తెలంగాణ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. క్రీడాకారుల ప్రతిభను మెరుగుపరచడం, వారిని క్రీడల్లో కొనసాగించడం, అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం, సంస్కరణల ఆధారంగా ఫలితాలు సాధించడం వంటి అంశాల ఆధారంగా నిధుల కేటాయింపునకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తద్వారా కేంద్ర-రాష్ట్రాల భాగస్వామ్య నమూనా మరింత బలోపేతం కానుంది. తెలంగాణ వంటి రాష్ట్రాలకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరమని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనిబాలా దేవి అన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలకు ఇది దోహదపడుతుందని, క్రీడలను విద్యా విధానంతో అనుసంధానం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

ఖేలో ఇండియా పథకం అమలు విధానం, రాష్ట్రాలు కీలక అంశాలను స్వీకరించే విధానాన్ని కార్యాచరణ మార్గదర్శకాలు వివరిస్తాయని బెంగళూరులోని ఎస్ఏఐ ప్రాంతీయ డైరెక్టర్ విష్ణు సుధాకరన్ తెలిపారు. గతంలో పరిమిత బడ్జెట్లతో కేంద్రీకృత విధానం ఉండేదని, విస్తృత స్థాయి చర్చల అనంతరం కొత్త ఖేలో ఇండియా పథకాన్ని రూపొందించామని చెప్పారు. 'ఖేలో ఇండియా ఉత్కృష్ట విద్యాలయాలు', ఫీడర్ పాఠశాలలు, ఖేలో ఇండియా కేంద్రాల ద్వారా శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రతిభా గుర్తింపు వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 'ఖేలో ఇండియా అథ్లెట్లు', 'వర్ధమాన ఖేలో ఇండియా అథ్లెట్లు' విభాగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.
జ్వాలా గుత్తాతో పాటు సాట్స్ వైస్ చైర్‌పర్సన్, ఎండీ డాక్టర్ ఏ. సోనిబాలా దేవి, ఎస్ఏఐ బెంగళూరు ప్రాంతీయ డైరెక్టర్ విష్ణు సుధాకరన్, ఎస్ఏఐ డిప్యూటీ డైరెక్టర్ ఎస్. హిమబిందు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

